సాక్షి
ఒడిశా

బుధవారం । 1 । ఫిబ్రవరి । 2023



శ్రీ మందిరం ఆదాయం లెక్కింపు

నగదు	రూ.3,48,290
బంగారం	1 గ్రాము 400 మిల్లీ గ్రాములు
వెండి	43 గ్రాముల 900 మిల్లీ గ్రాములు

- భువనేశ్వర్/పూరీ



సౌత్-కో జీఎం ఇళ్లపై విజిలెన్స్ దాడులు

- 8లో



ఉపాధ్యాయుడు అరెస్టు

- 8లో

న్యూస్‌రీల్

వేంకటేశ్వర ఆలయ సందర్శన



స్వామివారి దర్శనానికి విచ్చేస్తున్న గురు రవి శంకర్

భువనేశ్వర్: స్థానిక తిరుమల తిరుపతి దేవస్థానం వేంకటేశ్వర స్వామి ఆలయాన్ని గురు రవి శంకర్ మంగళవారం ఉదయం సందర్శించారు. శ్రీశ్రీ విశ్వ విద్యాలయం పర్యవేక్షణ పురస్కరించుకొని విచ్చేసిన ఆయన స్వామి వారిని దర్శించుకున్నట్లు జి.సంతోష్ తెలియజేశారు. రవి శంకర్‌కు స్వాగతం పలికేందుకు పెద్ద సంఖ్యలో స్థానికులు బారులుతీరారు.

పాఠశాలలో టీవీ చోరీ

రాయగడ: జిల్లాలో కాసీపూర్ సమితి టికిరి పంచాయతీలోని గొరఖ్‌పూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీవీ చోరీకి గురయ్యిందని పాఠశాల హెచ్‌ఎం డీకే బెహర పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం పాఠశాల మూసివేసిన అనంతరం సోమవారం తరగతి గది తెరిచి చూడగా అందులో 55 ఇంచుల టీవీ కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొద్ది నెలల క్రితం 5టీ పథకంలో భాగంగా విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు స్మార్ట్ తరగతులను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ క్రమంలో ఏర్పాటు చేసిన టీవీ చోరీకి గురయ్యింది.

వృద్ధురాలికి గాయాలు



చికిత్స పొందుతున్న వృద్ధురాలు

రాయగడ: రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు గాయపడింది. వివరాల్లోకి వెళ్తే.. జిల్లాలోని బిసంకటక్ సమితి సహాడ పంచాయతీ సముద్రబుదుని గ్రామానికి చెందిన 75 ఏళ్ల కంధమణి పాణి అనే వృద్ధ మహిళ బ్యాంకులో పింఛన్ డబ్బులు తీసుకునేందుకు బిసకంటక్ వెళ్లింది. డబ్బులు తీసుకున్న అనంతరం తిరుగు ప్రయాణంలో గ్రామానికి వస్తుండగా రోడ్డు ప్రమాదానికి గురైంది. రోడ్డు దాటుతుండగా ఒక ఆటో ఢీకొనడంతో ఆమెకు గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. అనంతరం ఆమెను బంధువులు ఇంటికి తీసుకెళ్లారు.

చెరువులో మునిగి యువకుడు మృతి



జయరాం మృతదేహం

రాయగడ: స్నానానికి వెళ్లిన యువకుడు చెరువులో మునిగి మృతి చెందిన ఘటన జిల్లాలోని బిసంకటక్ సమితి కాలిపొంఖ గ్రామంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే గ్రామానికి చెందిన జయరాం ఆవులను మేపేందుకు సమీపంలోని అడవికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి స్నానం కోసం చెరువు వద్దకు వెళ్లాడు. అయితే ప్రమాదవశాత్తు చెరువులో మునిగిపోవడంతో చనిపోయాడు. జయరాం ఇంటికి తిరిగి రాకపోవడంతో వెతికేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులకు చెరువులో శవమై తేలుతూ కనిపించాడు. దీంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది మృతదేహాన్ని బయటకు తీశారు. పోలీసులు శవాన్ని పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశారు.

కుట్ర కోణముందా..?

- మంత్రి నవ కిషోర్ దాస్ హత్యపై విపక్షాల సందేహాలు
- సీబీఐ దర్యాప్తు జరిపించాలి: బీజేపీ
- సిట్‌తో విచారణ జరగాలి: కాంగ్రెస్



మాట్లాడుతున్న కాంగ్రెస్ నేత పంచానన్ కనుంగో



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న సైంటిఫిక్ బృందం



మాట్లాడుతున్న బీజేపీ నేత జయ నారాయణ మిశ్రా

భువనేశ్వర్: రాష్ట్ర ఆరోగ్య-కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి నవ కిషోర్ దాస్ హత్యపై విపక్షాలు ప్రశ్నలు, సందేహాలు లేవనెత్తుతున్నాయి. ప్రధానంగా హోం శాఖ బాధ్యతలు నిర్వహిస్తున్న సీఎం నవీన్ పట్నాయక్‌ను వేలెత్తి చూపుతున్నాయి. బీజేపీ కార్యాలయంలో ఆ పార్టీ నాయకుడు జయనారాయణ మిశ్రా మంగళవారం మాట్లాడుతూ.. రాజకీయ, వ్యాపార కక్షలే హత్యకు కారణమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఒక మంత్రికే భద్రత లేకపోతే, ప్రజలకు ఎలా ఉంటుందని ప్రశ్నించారు. నిందితుడి మానసిక పరిస్థితి బాగులేకపోతే అతనికి ప్రమోషన్, పతకాలు, రివాల్వర్ ఎలా ఇచ్చారని సందేహం వ్యక్తం చేశారు. మానసిక స్థితి బాగోలేని అధికారులు ఎంత మంది ఉన్నారో పోలీసు శాఖ స్పష్టం చేయాలన్నారు. ఈ అంశంపై డీజీ ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. నిందితుడు పోలీసు సిబ్బంది కావడంతో నిష్పక్షపాత దర్యాప్తు కోసం ప్రభుత్వం ఈ కేసును సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు.

హత్యలో కుట్ర ఉంది

మంత్రి నవ కిషోర్ దాస్‌ను ఒక పోలీసు హత్య చేయడం వెనుక లోతైన కుట్ర ఉందని కాంగ్రెస్ ఆరోపించింది. ఆ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి పంచానన్ కనుంగో, రాష్ట్ర కాంగ్రెస్ అధికార ప్రతినిధి సుదర్శన్ దాస్ మాట్లాడుతూ.. ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) చేత దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. నిందితుడు పోలీసు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ కృష్ణ దాస్ మానసిక రుగ్మతతో బాధపడుతున్నారని చెబుతున్న తీరు అనుమానాలకు తావిస్తోందన్నారు. క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు నిష్పక్షపాతంగా జరిగే అవకాశం లేనందున సీఎం నవీన్ పట్నాయక్ హోం శాఖ పోర్ట్ ఫోలియోను వదులుకోవాలన్నారు. మిస్టరీ హత్యపై సిట్ విచారణకు ఆదేశించాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు. మంత్రి హత్య జరిగిన వెంటనే ఏఎస్‌ఐ భార్య అతని మానసిక సమస్యల గురించి చెప్పుకొచ్చింది. పోలీసు అధికారి గత రికార్డు, ఆరోగ్య సమస్యల పూర్వాపరాలు పర్యవేక్షించకుండా బాధ్యతాయుతమైన విధుల్లో ఎలా నియమించారో స్పష్టం చేయాలన్నారు.

దర్యాప్తు ముమ్మరం

మరోవైపు మంత్రి హత్య ఘటనపై క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు మరింత ముమ్మరం చేసింది. దర్యాప్తు బృందం సభ్యులు మంగళవారం గంజాం జిల్లా బరంపురం సమీపంలో జలేశ్వర్‌ఖండి గ్రామం సందర్శించారు. గ్రామంలో ఉంటున్న నిందిత పోలీసు అధికారి గోపాల కృష్ణ దాస్ కుటుంబ సభ్యులను ప్రశ్నించారు. నిందిత పోలీసు అధికారి అన్న సత్యనారాయణ దాస్‌ను క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు బృందం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందని క్రైమ్ బ్రాంచ్ డీఎస్పీ శిశిర్ మిశ్రా తెలిపారు. నిందితుడి భార్యతో సహా అతని కుటుంబ సభ్యులను ప్రస్తుతం విచారిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే దర్యాప్తులో భాగంగా మంత్రి వ్యక్తిగత భద్రతా అధికారిని ప్రశ్నిస్తున్నారు. హత్యకు సంబంధించి నవ కిషోర్ దాస్ డ్రైవర్‌ను కూడా దర్యాప్తు పరిధిలోకి తీసుకొని విచారణ చేపట్టారు.



మెటల్ డిటెక్టర్లతో పరిశీలన చేస్తున్న దృశ్యం

పోస్టుమార్టం నివేదిక సిద్ధం

మంత్రి పోస్టుమార్టం నివేదిక సిద్ధమైంది. పోస్టుమార్టం నిర్వహించిన వైద్య బృందం ఈ నివేదికను స్థానిక క్యాపిటల్ ఆస్పత్రి డైరెక్టర్ కార్యాలయంలో దాఖలు చేసింది. నవ కిషోర్ దాస్‌పై జరిగిన తుపాకీ కాల్పులు, తదనంతర మృత్యు ఘటన పురస్కరించుకుని చోటు చేసుకున్న పరిస్థితులను ఈ నివేదిక సవివరంగా స్పష్టం చేస్తుందని అనుబంధ వైద్య వర్గాల సమాచారం. మంత్రి నవ కిషోర్ దాస్ కాల్పుల ఘటనలో దర్యాప్తు ముమ్మరం అయింది. సైంటిఫిక్ బృందం ఘటనా స్థలంలో తనిఖీలు చేపట్టింది. మెటల్ డిటెక్టర్ సాయంతో ఘటనా స్థలంలో బలమైన సాక్ష్యాధారాల కోసం గాలిస్తున్నట్లు సైంటిఫిక్ బృందం తెలిపింది. ఆస్పత్రి వర్గాల నుంచి మంత్రి రక్తపు మరకల దుస్తులను స్వాధీనం చేసుకున్నట్లు ప్రకటించారు.

మన పంటకు.. దేశవ్యాప్త గుర్తింపు



ప్రధాని మోదీకి వివరాలు వెల్లడిస్తున్న బాలిక ప్రజ్ఞస్మిత

- ప్రధాని మోదీకి ప్రాజెక్టు వివరించిన విద్యార్థిని ప్రజ్ఞ

కొరాపుట్: కొరాపుట్ మట్టిలో పండించిన రాగి ఉత్పత్తులకు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఈ మేరకు కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కేంద్రీయ విద్యాలయం మంగళవారం వివరాలు వెల్లడించింది. దేశ రాజధాని న్యూఢిల్లీలో వైజ్ఞానిక మేళాకి హాజరవ్వాల్సిందిగా ఒడిశా విభాగ కేంద్రీయ విద్యాలయం రీజనల్ కార్యాలయానికి ఇటీవల సమాచారం వచ్చింది. దీంతో వారు కొరాపుట్ విద్యాలయానికి సమాచారం అందించారు. ఇక్కడ పండిస్తున్న రాగి పంట, దాని నుంచి తయారవుతున్న ఉత్పత్తుల మీద ప్రత్యేక ప్రాజెక్టు తయారు చేశారు. దీనిని వివరించేందుకు కొరాపుట్‌కి చెందిన 9వ తరగతి విద్యార్థిని ప్రజ్ఞ స్మితా బెహరా ప్రదర్శనకు హాజరయ్యారు. ఢిల్లీ కార్యక్రమంలో భాగంగా ప్రధాని మోదీ ప్రజ్ఞ వద్దకు వచ్చి ప్రదర్శన వివరాలు అడిగారు. సాక్షాత్తు దేశ ప్రధాని తన ముందుకు రావడంతో ప్రజ్ఞ మొదట కొంత తడబడినా తర్వాత స్థిమితపడింది. అనంతరం కొరాపుట్ ప్రాంతంలో గిరిజనులు పండిస్తున్న రాగి పంటలు, సేంద్రియ విధానం, దాని ఉత్పత్తులు, పోషక విలువలు గురించి స్పష్టంగా వివరించింది. దీంతో ప్రధాని మోదీ కాసేపు ఆ బాలికతో ముచ్చటించారు. గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం కొరాపుట్‌లో పండిస్తున్న రాగి పంటలకు ప్రచారం కల్పిస్తుండగా, ఇప్పుడు దేశవ్యాప్తంగా గుర్తింపు లభించింది. ఈ మేరకు విద్యార్థిని ప్రజ్ఞకు కొరాపుట్ కేంద్రీయ విద్యాలయం అభినందనలు తెలియజేసింది.

జట్నీలో మొబైల్ మార్చురీ





మొబైల్ మార్చురీ ప్రారంభిస్తున్న దృశ్యం

భువనేశ్వర్: ఖుర్దారోడ్ (జట్నీ)లో క్రిస్టియన్ బరియల్ సంఘం ఆధ్వర్యంలో మొబైల్ మార్చురీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. పట్టణ పరిధిలో ఈ సేవలు పరిమితం అవుతాయని సంఘం అధ్యక్షుడు ఎస్.జాన్ తెలిపారు. లాభాపేక్ష లేకుండా నామమాత్రపు రుసుముతో సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. సేవలు పొందేందుకు 80933 91710 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. 24 గంటల పాటు అందుబాటులో ఉంటుందని నిర్వాహక సభ్యుడు దీపక్ కుమార్ నాయక్ తెలిపారు. విశాఖపట్నం ప్రాంతపు సంస్థ ఓర్షూ ఎంటర్‌ప్రైజెస్ సౌజన్యంతో ఈ సేవలు కల్పిస్తున్నట్లు శామ్యుల్ ప్రధాన్ తెలిపాడు. సేవలు కుల, మతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు లభిస్తాయని ఆంథోని హారీ ప్రకటించారు.

వాలంటీర్లకు కిట్లు పంపిణీ



కిట్లతో ఆపద మిత్ర వాలంటీర్లు

పర్లాకిమిడి: ఒడిశా విపత్తుల నిర్వహణ అథారిటీ (ఓఎస్‌డీఎంఏ) ఆధ్వర్యంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ రిసోర్సు కేంద్రంలో 12 రోజుల పాటు 40 ఆపద మిత్ర వాలంటీర్లకు శిక్షణ అందించారు. వీరందరికీ కలెక్టరేట్ వద్ద కిట్లను మంగళవారం అందజేశారు. కిట్‌లో రూ.12 వేలు విలువ చేసే లైఫ్ జాకెట్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, తాళ్లు తదితర వస్తువులు వున్నాయి. ఈ వాలంటీర్లు ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజల ప్రాణాలు కాపాడటానికి ప్రభుత్వ అధికారులతో కలిసి పనిచేస్తారని జిల్లా అత్యవసర అధికారి ప్రభాస్ కుమార్ బెరువా తెలిపారు. వచ్చేనెలలో గుమ్మాబ్లాక్‌లో గతేడాది కొండ చరియలు విరిగిపడి నేలమట్టమైన గ్రామాల్లో వాలంటీర్లకు కూడా ఆపద మిత్ర శిక్షణ శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి ప్రదోష్ కుమార్ శతపతి తెలియజేశారు.

10 జిల్లాల్లో వర్చువల్ హైకోర్టులు

భువనేశ్వర్: రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో హైకోర్టు వీడియో కాన్ఫరెన్సింగ్ (వీసీ) క్యాబిన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. తొలి దశలో 10 న్యాయస్థానాల్లో ఈ వ్యవస్థ ప్రారంభమవుతుంది. ఈ ఏడాది ఫిబ్రవరి 3వ తేదీన బాలేశ్వర్, బరంపురం (గంజాం), భద్రక్, భవానీపట్న (కలహండి), భువనేశ్వర్ (ఖుర్దా), బొలంగీర్, జయపురం (కొరాపుట్), పూరీ, రౌర్కెలా (సుందర్‌గడ్), సంబల్‌పూర్‌లో వర్చువల్ హైకోర్టులు ఏర్పాటు చేయనున్నారు. గతేడాది డిసెంబర్ 14వ తేదీన సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని 30 న్యాయస్థానాల అధీనంలో ప్రత్యేక వీసీ క్యాబిన్లను ఏర్పాటు చేయాలని హైకోర్టు నిర్ణయం తీసుకోవడం విశేషం. వీసీ క్యాబిన్ల కార్యాచరణ, నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బందిని నియమించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు హైకోర్టు రిజిస్ట్రీ ఆదేశాలు జారీ చేసింది. ఈ-ఫైలింగ్, మెన్షనింగ్, లోపాలను తొలగించడం, కేసుల వర్చువల్ హియరింగ్, సర్టిఫైడ్ కాపీ లభ్యత కార్యకలాపాలు నిర్వహిస్తారు. నిర్ధారిత నిర్వహణ నియమావళి (ఎస్‌వోపీ) ప్రకారం వీడియో క్యాబిన్లలో ఇతర ఏర్పాట్లు ఉంటాయి. ఈ వీసీ క్యాబిన్లన్నీ వర్చువల్ హైకోర్టులుగా పనిచేస్తాయి.

నిరుపయోగం





స్థానిక డోలా ట్యాంకు వద్ద రోడ్డు పక్కనే ఏర్పాటు చేసిన వ్యాయామ, క్రీడా వస్తువులు నిరుపయోగంగా పడి ఉన్నాయి. ఆ ప్రాంతమంతా చెత్తకుప్పలతో ఉండడంతో స్థానికులు అటువైపు కూడా చూడడం లేదు. ఈ ప్రాంతంలో వ్యాయామ వస్తువులు అధికారులు ఏర్పాటు చేయడం ద్వారా ప్రభుత్వ ధనం వృథా అయ్యిందని స్థానికులు విమర్శిస్తున్నారు. ముందుగా డోలా ట్యాంకును అభివృద్ధి చేసి ఈ వ్యాయామ, క్రీడా వస్తువులు వినియోగంలోకి తీసుకొని రావాలని కోరుతున్నారు. – పర్లాకిమిడి

నాటుసారా బట్టీలు ధ్వంసం



సారా వంట సామగ్రి, డ్రమ్ములతో ఎక్సైజ్ సిబ్బంది

జయపురం: జయపురం సమితి టంకువ పంచాయతీ డిమ్మ గ్రామంలో నాటుసారా బట్టీలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఎక్సైజ్ అధికారి దుర్భధల బిశ్వాల్ తెలిపిన వివరాల మేరకు.. దాడుల్లో 30 లీటర్ల నాటుసారాతో పాటు రూ.1000 లీటర్లకు పైగా ఇప్ప ఊటను కనుగొన్నట్లు వెల్లడించారు. వీటి విలువ రూ.50 వేలు ఉంటుందని పేర్కొన్నారు. అడవిలో సారా వంట జరుగుతున్న సమాచారం తెలియడంతో దాడులు నిర్వహించామన్నారు. అయితే సారా తయారు చేస్తున్న వారు అక్కడి నుంచి పారిపోయారని వెల్లడించారు. దాడిలో ఏఎస్‌ఐ ఎం.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

202 కేజీల గంజాయి పట్టివేత



నిందితులు, పట్టుబడిన గంజాయిని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితిలో 202 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. చిత్రకొండ ప్రాంతంలో ఉన్న ఎస్ఆర్ కంపెనీ కూడలి సమీపంలో సోమవారం రాత్రి పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించారు. ఈ సమయంలో ద్విచక్ర వాహనంపై అతివేగంగా వస్తున్న ఒక వ్యక్తిని పోలీసులు ప్రశ్నించారు. దీంతో ఆంధ్రాకు గంజాయిని తరలిస్తున్నట్లు ఆ వ్యక్తి నిజాన్ని ఒప్పుకున్నాడు. వెంటనే వెనకనే వచ్చిన ఆటోని ఆపి తనిఖీ చేయగా 7 బస్తాల్లో తరలిస్తున్న గంజాయి బయటపడింది. వెంటనే వాహనాలు, గంజాయి బస్తాలను స్వాధీనం చేసుకొని నలుగురు వ్యక్తులను అరెస్టు చేశారు. వీరంతా చిత్రకొండ సమితి రంగిణిగూఢ గ్రామానికి చెందిన ప్రసాద్ ఖిలో, లామాసింగ్ గ్రామానికి చెందిన సుందర్ సిసా, సరియాపల్లి గ్రామానికి చెందిన ధ్రువఖోర, దతునగూఢ గ్రామానికి చెందిన రాయిమోహన్ పంగిలుగా గుర్తించినట్లు చిత్రకొండ ఐఐసీ ముకుంద మేలకా వెల్లడించారు.

క్లుప్తంగా

ఎస్‌డీపీవో బదిలీ

భువనేశ్వర్‌: మంత్రి హత్యా ఘటన ప్రభావంతో బ్రజ్‌రాజ్‌ నగర్‌ ఎస్‌డీపీవో గుప్తేశ్వర్‌ భోయిపై బదిలీ వేటు వేశారు. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో నియమించారు. ఆయన స్థానంలో అలౌమల్లిక్‌ ఎస్‌డీపీవో చింతామణి ప్రధాన్‌ని నియమించినట్లు మంగళవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఝార్సుగుడ ఎస్పీ బదిలీ

భువనేశ్వర్‌: మంత్రి నవ కిషోర్‌ దాస్‌ హత్య కేసులో విచారణ కొనసాగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఐపీఎస్‌ కేడర్‌లో పలు మార్పులు చేసింది. ఈ నేపథ్యంలో బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ ఉత్తర్వుల మేరకు ఝార్సుగుడ జిల్లా ఎస్పీ రాహుల్‌ జైను రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయానికి తరలించారు. బర్‌గడ్‌ జిల్లా ఎస్పీ స్మిత్‌ పర్మార్‌ని ఝార్సుగుడ ఎస్పీగా నియమించారు. బౌధ్‌ జిల్లా ఎస్పీ ప్రహ్లాద్‌ మీనాను బర్‌గడ్‌ జిల్లాకు, రాయగడ జిల్లా ఏఎస్పీ రాజ్‌ ప్రసాద్‌ను బౌధ్‌ జిల్లా ఎస్పీగా నియమించారు.

రోడ్డు ప్రమాదంలో పశువులు మృతి



ప్రమాదంలో మృతి చెందిన పశువులు

రాయగడ: జిల్లాలో బిసంకటక్‌ సమీపంలోని గుత్తిగుడ ప్రాంతంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడు పశువులు మృతి చెందగా, వాహన చోదకుడు గాయాల పాలయ్యాడు. బిసంకటక్‌ నుంచి ఒక పికప్‌ వ్యాన్‌లో పశువులను తీసుకొస్తుండగా ఎదురుగా వస్తున్న ఒక లారీ అదుపుతప్పి వ్యాన్‌ను ఢీకొంది. దీంతో వ్యాన్‌ బోల్తాపడింది. ప్రమాదంలో పశువులు అక్కడికక్కడే మృతి చెందగా, వ్యాన్‌ డ్రైవరుకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే డ్రైవర్‌ను బిసంకటక్‌ ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జంషెడ్‌పూర్‌కు ప్రత్యక్ష విమానయానం

భువనేశ్వర్‌: భువనేశ్వర్‌ నుంచి జంషెడ్‌పూర్‌కు ప్రత్యక్ష విమానయాన సేవలు ప్రారంభమయ్యాయి. తొలి విమానం మంగళవారం ఉదయం 7.30 గంటలకు బయల్దేరింది. ఉడాన్‌ పథకం కింద ఇండియా వన్‌ ఎయిర్‌ సంస్థ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది. త్వరలో ఈ సేవలను కోల్‌కతాకు అనుసంధాన చేసి విస్తరిస్తారు. జంషెడ్‌పూర్‌ మీదుగా భువనేశ్వర్‌ నుంచి కోల్‌కతాకు విమానయాన సౌకర్యం అందుబాటులోకి వస్తుంది. భువనేశ్వర్‌–జంషెడ్‌పూర్‌–కోల్‌కతా విమానయానం టికెట్ల బుకింగ్‌ కొనసాగుతోంది. ఫిబ్రవరి 14 నుంచి ప్రత్యేక రాయితీ లభిస్తుంది. భువనేశ్వర్‌ నుంచి జంషెడ్‌పూర్‌కు రూ.2,999, జంషెడ్‌పూర్‌ నుంచి కోల్‌కతా రూ.1,999లు టికెట్‌ ధరగా ఇండియా వన్‌ ఎయిర్‌ ప్రకటించింది. భువనేశ్వర్‌ నుంచి నిత్యం ఉదయం 6.30 గంటలకు బయల్దేరి 7.50 గంటలకు జంషెడ్‌పూర్‌ చేరుతుంది. మరలా జంషెడ్‌పూర్‌లో ఉదయం 8.15 గంటలకు బయల్దేరి 9.20 గంటలకు కలకత్తా చేరుతుంది. కోల్‌కతాలో ఉదయం 10 గంటలకు బయల్దేరి 11.15 గంటలకు జంషెడ్‌పూర్‌ చేరుతుంది. జంషెడ్‌పూర్‌లో మధ్యాహ్నం 12.45 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.05 గంటలకు భువనేశ్వర్‌ చేరుతుంది.

ఉపాధ్యాయుడు అరెస్టు



ఉపాధ్యాయుడు సురోజ్‌ని చూపిస్తున్న పోలీసులు

మల్కన్‌గిరి: జిల్లాలోని మత్తిలి సమితి కర్తన్‌పల్లి ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయుడు సరోజ్‌ మల్లును పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. ఇటీవల గుజరాత్‌లో పంచాయతీ సర్వీస్‌ సెలక్షన్‌ బోర్డు ఆధ్వర్యంలో 1,181 జూనియర్‌ క్లర్క్‌ పోస్టులు భర్తీకి పరీక్ష నిర్వహించాలని అనుకున్నారు. ఈ పోస్టుల కోసం మొత్తం 9,53,000 మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారు. అయితే పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ప్రశ్నాపత్రాలు లీకైనట్లు వార్తలు వచ్చాయి. దీంతో పోలీసులు దర్యాప్తు చేసి మొత్తం 15 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో మల్కన్‌గిరికు చెందిన సురోజ్‌ కూడా ఉన్నారు. దీంతో గుజరాత్‌ నుంచి ఒక పోలీసు బృందం వచ్చి మల్కన్‌గిరి పోలీసుల సాయంతో సురోజ్‌ను అరెస్టు చేశారు. దీనిపై మల్కన్‌గిరి ఎస్పీ పి.నీతిష్‌ వాద్వానీ వివరణ కోరగా సురోజ్‌ను గుజరాత్‌ తరలించి అక్కడ కోర్టులో హాజరుపరుస్తారని వెల్లడించారు.

సౌత్‌-కో జీఎం ఇళ్లపై విజిలెన్స్‌ దాడులు



లుచ్చాపడా మెయిన్‌ రోడ్డులోని ఇల్లు (ఇన్‌సెట్లో) జీఎం ప్రమోద్‌ కుమార్‌ చౌదరి

బరంపురం: నగరంలోని టాటా ఎలక్ట్రికల్‌ సౌత్‌–కో విభాగానికి చెందిన జీఎం ప్రమోద్‌ కుమార్‌ చౌదరి ఆదాయానికి మించిన ఆస్తులపై విజిలెన్స్‌ అధికారులు దాడులు చేపట్టారు. విజిలెన్స్‌ ఎస్పీ మనోరంజన్‌ పండా తెలిపిన సమాచారం మేరకు.. మంగళవారం ఉదయం 6 గంటల సమయంలో ప్రమోద్‌ కుమార్‌ చౌదరి ఆస్తులపై విజిలన్స్‌ అధికారులు ఏకకాలంలో 10 వేర్వేరు ప్రాంతాల్లో దాడులు చేపట్టారు. సిద్దార్థ నగర్‌ మొదటి లైన్‌లో ఉన్న మూడు అంతస్తుల భవనం, 3వ లైన్‌లో ఉన్న మూడంతస్తుల భవనం, గోపాల్‌పూర్‌ దగ్గర హరిపూర్‌లో రెండు అంతస్తుల భవనం, నగరానికి దగ్గర గోంజు గ్రామంలో ఫామ్‌ హౌస్‌, లుచ్చాపడా మెయిన్‌ రోడ్డులోని ఇల్లు, పూరి జిల్లా పిప్పిలిలో ఒక ప్లాట్‌, నగర శివారు అంబపువాలో ఒక ప్లాట్‌, సొంత గ్రామం గంజాం జిల్లా బాలకృష్ణపూర్‌లో తన బంధువుల ఇళ్లు, లుచ్చాపడా మెయిన్‌ రోడ్డులో ఉన్న కార్యాలయం, కోర్టుపేట జంక్షన్‌లో తన చాంబర్‌లపై దాడులు చేపట్టారు. దీనిలో భాగంగా భవనాలు, అపార్ట్‌మెంట్లు, ఇళ్ల స్థలాల పత్రాలు, బంగారం ఆభరణాలు, బ్యాంక్‌ ఖాతా పుస్తకాలు, బ్యాంక్‌బుక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు సుమారు రూ.2.30 కోట్లు ఆస్తులు లెక్కించినట్లు చెప్పారు. ఇంకా సోదాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు.

నిబంధనలు తప్పనిసరి



మాట్లాడుతున్న దాస్‌, పక్కనే ఐఐసీ ప్రదాన్‌

రాయగడ: ఆటోలు నడిపేటప్పుడు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేదంటే చర్యలు తప్పవని ఎస్‌డీపీవో దేవజ్యోతి దాస్‌ హెచ్చరించారు. సదరు పోలీసుస్టేషన్‌లో ఆటో డ్రైవర్లతో సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. అధికంగా ప్రయాణికులను ఎక్కించడం వలన ఆటోలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇకపై నిబంధనలు పాటించకుంటే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. తనిఖీలు నిర్వహించే సమయంలో డ్రైవర్లు లైసెన్స్‌లతో పాటు సంబంధిత పత్రాలను చూపించాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఐఐసీ రశ్మీరంజన్‌ ప్రధాన్‌ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



బుల్డోజర్లతో తొలగిస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని మునిగుడలో రైల్వే ఆక్రమణల తొలగింపు కార్యక్రమాలకు అధికారులు శ్రీకారం చుట్టారు. మెయిన్‌ రోడ్డు పరిసర ప్రాంతాల్లో గల రైల్వే స్థలాల్లో గత కొన్నేళ్లుగా ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్న దుకాణాలను అధికారులు మంగళవారం తొలగించారు. సదరు పోలీసులు, రైల్వే ఆర్‌పీఎఫ్‌ బలగాల ఆధ్వర్యంలో సుమారు 30 దుకాణాల తొలగింపు పనులు చేపట్టారు. తహసీల్దార్‌ దేవాశీష్‌ గౌడో, ఐఐసీ సుగ్యాని సాహుల సమక్షంలో తొలగింపు కార్యక్రమాలు కొనసాగాయి.

విద్యుత్‌ షాక్‌తో తాపీమేస్త్రీ మృతి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీనగర్‌లో మంగళవారం ఉదయం విద్యుత్‌ షాక్‌ కొట్టి హనుమంతు కృష్ణారావు(52) అనే తాపీమేస్త్రీ మృతి చెందారు. వజ్రపుకొత్తూరు మండలం మహాదేవపురం గ్రామానికి చెందిన కృష్ణారావు(52) శివాజీనగర్‌లో పనులు చేస్తున్నారు. పొడవైన ఇనుపరాడ్డును మేడపై తిప్పే క్రమంలో అది విద్యుత్‌ తీగలకు తాకడంతో షాక్‌ కొట్టి అక్కడికక్కడే చనిపోయాడని పోలీసులు తెలిపారు. కాశీబుగ్గ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య మహాలక్ష్మి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అలుదులో చోరీ

సారవకోట: అలుదు గ్రామంలోని శిమ్మ భారమ్మ అనే మహిళ ఇంటిలో చోరీ జరిగింది. దొంగలు రూ.2 లక్షల విలువ గల సొత్తు దొంగిలించారని ఆమె మంగళవారం స్థానిక పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కిటికీ ఊచలు విరిచి ఇంటిలోకి జొరబడి ఇంటిలో ఉన్న రెండున్నర తులాల బంగారం, అర కిలో వెండి, రూ.30 వేలు వరకు నగదు చోరీ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించామని, కేసు నమోదు చేయలేదని ఎస్‌ఐ అప్పారావు తెలిపారు.

సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో అగ్నిప్రమాదం



మంటల్లో ఉన్న సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం

భువనేశ్వర్‌: కటక్‌ సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయంలో అగ్ని ప్రమాదం సంభవించింది. సబ్‌ రిజిస్ట్రార్‌ కార్యాలయం రికార్డు గదిలో మంగళవారం ఉదయం మంటలు చెలరేగాయి. మంటల్లో ఫర్నీచర్‌, దస్తావేజులు దగ్ధమయ్యాయి. మంటలను అదుపు చేయడానికి మూడు యూనిట్ల అగ్నిమాపక దళాలు పాల్గొన్నాయి. మంటల్లో చిక్కుకున్న వ్యక్తిని అగ్నిమాపక దళం జవాన్లు ప్రాణాపాయం నుంచి రక్షించారు. పోలీసు ఉన్నతాధికారులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రత్యక్షంగా పర్యవేక్షించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది. రిజిస్ట్రార్‌ కార్యాలయం సమీపంలోని హోటల్‌ నుంచి మంటలు వ్యాపించినట్లు భావిస్తున్నారు. ఈ ప్రాంతంలో ఉన్న అబ్కారీ విభాగం గోదాం సైతం మంటల్లో చిక్కుకుంది.

అనగనగా.. ఉద్దానం మునగ

- ఉద్దానం మునగకు మార్కెట్‌లో డిమాండ్‌
- జనవరి మొదటి వారంలో కిలో రూ.120లు
- ప్రస్తుతం రూ.50కు తగ్గిన ధర



పలాసలో మునగకాయలను విక్రయిస్తున్న రైతులు

పలాస: ఉద్దానం మునగకు డిమాండ్‌ పెరుగుతోంది. ఒకప్పుడు పెరటి పంటగా ఇది ఇంటి అవసరాల కోసం సాగు చేసేవారు. మునగ ఆకులు చారులోను, మునగ కాయలు కూడా చారులోను, విడిగా ఇతర కాయగూరల్లో కలపి వండుకొని తినేవారు. అయితే ఇప్పుడు వాణిజ్య పంటగా మునగ మారింది. పలాస మార్కెట్‌లో ఈ మునగ కాయలకు మంచి డిమాండ్‌ ఉంది. జనవరి మొదటి వారంలో కిలో మునగ కాయలు రూ.120 పలికాయి. ఇప్పుడు సీజన్‌ తగ్గడంతో పాటు కిలో మునగ కాయల ధర కూడా రూ. 50లకు పడిపోయింది.

పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో సుమారు 20వేల హెక్టార్ల విస్తీర్ణంలో జీడి కొబ్బరి సాగవుతోంది. ఈ తోటల్లో రైతులు మునగ పంటను అంతర పంటగా పండిస్తూ లాభపడుతున్నారు. ఎక్కడ చిన్న ఖాళీ స్థలం కనిపించినా అక్కడ మునగ చెట్టు ఉంటుంది. ఏడాదికి మూడు సార్లు ఈ మునగ కాపునకు వస్తుంది. ఈ ఏడాది పలాస నియోజకవర్గంలోని పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలంలో జనవరి నెలలో విపరీతంగా మునగ కాపునకు వచ్చింది. పండగ ముందు రైతుకు కాసులు పంట కురిపించింది. ఇక్కడి నుంచి ఒడిశా, పశ్చిమబెంగాల్‌, ఉత్తరప్రదేశ్‌, బీహారు, తెలంగాణాతో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని ముఖ్య పట్టణాలకు ఎగుమతి చేసినట్లు వ్యాపారి అచ్యుత పాత్రో చెప్పారు.



విరగ కాసిన మునగ చెట్టు

కిలో మునగాకు రూ.80



ఈ మునగాకుకు ఇతర పాశ్చాత్య దేశాల్లో బాగా డిమాండ్‌ ఉంది. కిలో మునగాకు ధర రూ.80లుగా ఉంది. మునగ విత్తనాలు కిలో రూ.500లుగా ఉన్నాయి. ఇది ఔషధాల నిధి. మునగ విత్తనాల్లో యాంటీ ఆక్సిడెంట్స్‌ ఉంటాయి. కాలేయాన్ని, మూత్ర పిండాలను శుభ్రం చేస్తుంది. పోషకాహారలోపాన్ని, సకల రోగాలను నివారించే ఔషధ గుణం ఉందని ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. దీనికి ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా డిమాండు ఉంది.

– శంకర్‌ దాస్‌, ఉద్యానవన శాఖాధికారి, పలాస

విరగ కాసింది



గతంలో ఎన్నడూ లేని విధంగా మునగ విరగ కాసింది. పండగ ముందు ఈ పంట చేతికి రావడం చాలా సంతోషం. ఒక్క మునగ చెట్టు ఉన్నోడు కూడా రెండు మూడు వేలకు కాయలను అమ్ముకున్నాడు. నాకు తక్కువ చెట్లే ఉన్నా యి. అయినా రూ.10వేలకు ఈ కాయలను అమ్మాను. మా చిన్నప్పుడు నుంచి మునగాకులను చారులోను, వేపుడు చేసికొని, అలాగే జినుగులు, పప్పులోను వేసుకొని తినేవాళ్లం.

– వంకల గురునాథం, రైతు, మామిడిపల్లి, పలాస మండలం

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి



బీడీవో ఇన్‌చార్జి అధికారి గొమాంగోకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని కల్యాణ సింగుపూర్‌ సమితి పర్శాలి పంచాయతీలోని లేఖాపాదొరొ ఆదివాసీ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరారు. ఈ మేరకు వారంతా కలిసి సమితి బీడీవో గొమాంగోకు మంగళవారం వినతి పత్రం అందించారు. నెల రోజుల వ్యవధిలో సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోకపోతే కార్యాలయాన్ని ముట్టడిస్తామని డ్రింజు కృషిక, సికక మను, సికక సీమ, సికక కంటు తదితరులు పేర్కొన్నారు. నియగిరి పర్వత ప్రాంతంలో గల లేఖాపాదొరొ గ్రామంలో సమారు రెండు వందలకు పైబడిన డొంగిరియా తెగకు చెందిన ఆదివాసీలు నివసిస్తున్నారు. ఇంతవరకు వీరికి తాగునీటి, రహదారి వంటి మౌలిక సౌకర్యాలు లేకపోవడంతో ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

ఇదే విషయమై పలుమార్లు సంబంధిత అధికారులకు తెలియజేసినప్పటికీ ఫలితం లేకపోయిందని వారు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని సౌకర్యాలు కల్పించాలని కోరారు.

కలియాగాంలో గ్రామసభ



గ్రామసభలో పాల్గొన్న అధికారులు

జయపురం: జయపురం సమితి కలియాగాం గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా బీడీవో రాజీవ్‌ దాస్‌ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. గత నెలలో ప్రజలు చేసిన ఫిర్యాదులు పరిశీలించామని, సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. అర్హులందరికీ ప్రధానమంత్రి అవాస్‌ యోజన పథకం వర్తింపజేస్తామని వెల్లడించారు. తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని, వెంటనే పంచాయతీ గ్రామాల్లో తాగునీటి వనరులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరారు. అలాగే వృద్ధులు, వికలాంగులు, వితంవులకు సక్రంగా పింఛన్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. దీంతో సమస్యలు తక్షణమే పరిష్కరించాలని అధికారులకు బీడీవో ఆదేశించారు. సమావేశంలో రాజీవ్‌ మిషన్‌ అధికారి నమిత త్రిపాఠీ, రూరల్‌ వాటర్‌ సప్లయ్‌ జూనియర్‌ ఇంజినీర్‌ రంజిత త్రిపాఠీ, సీడీపీవో సుచేత పండ పాల్గొన్నారు.

కారులో చెలరేగిన మంటలు



చెట్టును ఢీకొని తగలబడిపోతున్న కారు, మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

పర్లాకిమిడి: గజపతి జిల్లా అడవ పోలీసుస్టేషన్‌ పరిధిలోని పాణిగండ ఘాటి వద్ద ఒక కారులో మంటలు చెలరేగాయి. వివరాల్లోకి వెళ్తే.. బరంపురం నుంచి అడవ, పాణిగండ మీదుగా ఆయుర్వేదిక్‌ డాక్టర్‌ ఖోదాల్‌ ప్రదాన్‌, ఆయన మేనేజరు, కారు ఓనరు సదానంద రౌళోలు సుమారు రూ.4 లక్షల మందులతో కంధమాల్‌ జిల్లా బ్రాహ్మణిగాంలోని ఆయుర్వేదిక్‌ క్లినిక్‌కు వెళ్తుండగా కారులో మంటలు వచ్చాయి. వెంటనే డాక్టర్‌ ప్రధాన్‌, ఆయన మేనేజర్‌, ఓనర్‌ సదానంద రౌళోలు కారు నుంచి బయటకు దూకారు.

దీంతో కారు అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొంది. కారులో ఉన్నవారు ప్రాణాలతో బయటపడగా, మంటల్లో కారు బూడిదైంది. విషయం తెలుసుకున్న మోహనా అగ్నిమాపక దళం విభాగం సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాద బాధితులకు తక్షణ వైద్యం

- కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్‌ శ్రీకేష్‌ బి.లాఠకర్‌

శ్రీకాకుళం పాతబస్టాండ్‌: ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్‌, ఆరోగ్య శ్రీ అదనపు సీఈఓ శ్రీకేష్‌ బి.లాఠకర్‌ అన్నారు. ఆయన మంగళవారం కలెక్టర్‌ కార్యాలయ సమావేశ మందిరంలో ఆరోగ్య శ్రీ పథకంపై ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రుల ప్రతినిధులతో జిల్లా క్రమశిక్షణ కమిటీలో సమీక్షించారు. ప్రమాదాల బాధితులకు తక్షణం వైద్యం చేయాలని సూచించారు. ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షల రేట్లను డిస్‌ప్లే చేయాలన్నారు. ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యానికి వచ్చే పేషెంట్స్‌ వద్ద నగదు తీసుకోకుండా వైద్యం చేయాలన్నారు. ఒక వేళ నగదు తీసుకుంటే తిరిగి చెల్లించేటప్పుడు చెక్కులు లేదా ఫోన్‌ పే ద్వారా డిశ్చార్జ్‌ అవ్వకముందే చెల్లించాలని చెప్పారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఆరోగ్య శ్రీ వైద్యం సరిగా జరగడం లేదని, డీసీహెచ్‌ దీనిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రతి నెల వర్చువల్‌ ద్వారానైనా సమావేశం నిర్వహించాలన్నారు. రాష్ట్ర స్థాయిలో గత 3 నెలలుగా ఆరోగ్య శ్రీ లో ఎన్నో స్థానంలో ఉందని అడగ్గా, 13వ స్థానంలో ఉన్నట్లు ఆరోగ్య శ్రీ జిల్లా కోఆర్డినేటర్‌ కలెక్టర్‌కు వివరించారు. జెమ్స్‌ ఆస్పత్రిలో 5700 ఆరోగ్య శ్రీ కేసులు చూశారని చెప్పగా యాజమాన్యాన్ని అభినందించారు. జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే టెలిఫోనిక్‌ ఇంటిమేషన్‌ ద్వారా ఎలాంటి గుర్తింపు కార్డు లేకపోయినా చికిత్స చేయాలన్నారు. ఆరోగ్య శ్రీ జిల్లా కో ఆర్డినేటర్‌ డాక్టర్‌ పి.ప్రకాశరావు ఆరోగ్య శ్రీ పై వివరించారు.

చిరుధాన్యాల సాగుతో బాగు



పొలం బడి కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయశాఖాధికారులు

హిరమండలం: చిరుధాన్యాల సాగు రైతులకు మేలు చేస్తుందని వైఎస్సార్‌ పొలంబడి రాష్ట్ర పరిశీలకులు డి.ప్రవీణ్‌, ఆత్మా పీడీ కె.కృష్ణారావు అన్నారు. మండలంలోని అక్కరాపల్లి పంచాయతీ సీది గ్రామంలో చిరుధాన్యాల సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో వీరు పాల్గొన్నారు. గతంలో చాలా ఇళ్లల్లో రాగిముద్ద, కొర్ర అన్నం, జొన్న రొట్టెలు, చిరుధాన్యాల ఆహార పదార్థాలు తినేవారని, అందుకే అప్పట్లో జీవన ప్రమాణాలు ఎక్కువగా ఉండేవని తెలిపారు. చిరు ధాన్యాల సాగు తగ్గాక ఆయుఃప్రమాణాలు కూడా తగ్గిపోయాయన్నారు. రాగులు, సామలు, కొర్రలు, సజ్జలు, జొన్నలు వంటి చిరుధాన్యాలు పండించాలన్నారు. దీనికి ప్రభుత్వం కూడా సహకరిస్తోందని చెప్పారు. అనంతరం వ్యవసాధికారులు చిరుధాన్యాల సాగు, విత్తన శుద్ధి, విత్తన మోతాదు, ఎరువుల వాడకం, కలుపు నివారణ, నీటియాజమాన్యం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సీదిలో రాగి సాగు చేస్తున్న పొలంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీఏలు సీహెచ్‌ వెంకట్రావు, రాజగోపాల్‌, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌ గోళ్ల నాగేశ్వరరావు, స్థానిక సర్పంచ్‌ రామారావు, ఎంపీటీసీ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పారా వాలీబాల్ ఆంధ్రా జట్టు కెప్టెన్‌కు అభినందనలు



శ్రీనివాసరావును అభినందిస్తున్న ఎంపీపీ,ఎంపీడీఓలు

కొత్తవలస: ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి పారా వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆంధ్రప్రదేశ్ జట్టుకు కెప్టెన్‌గా ఎంపికైన పాటిపిరెడ్డి శ్రీనివాస రావును ఎంపీడీఓ వై.పద్మజ, ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మలు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో అభినందించారు. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి జరగనున్న జాతీయస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. శ్రీనివాసరావు ప్రస్తుతం కొత్తవలస మండలం తుమ్మికాపల్లి సచివాలయంలో డిజిటల్ సహాయకుడిగా పనిచేస్తున్నారు. ఈ మేరకు ఆయన సహచర సిబ్బంది అభినందనలు తెలియజేశారు.

పురుగు మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గంట్యాడ: మండలంలోని మధుపాడ గ్రామానికి చెందిన ఎం. శంకర్‌రావు(32) పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో డబ్బులు తీశాడని కుటుంబసభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై ఈ నెల 28వ తేదీన శంకర్‌రావు పురుగు మందు తాగేశాడు. అపస్మారక స్థితిలోకి చేరుకున్న శంకరరావును కుటుంబ సభ్యులు ఎస్.కోట ఆస్పత్రిలో చేర్పించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె. కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

ఇద్దరు ముద్దాయిలకు జైలు, జరిమానా

రేగిడి: మండల పరిధి అంబకండి గ్రామానికి చెందిన జోగ వెంకట రమణకు ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి మోసగించిన వ్యక్తులకు రాజాం జూనియర్ సివిల్ జడ్జి పీఎస్‌వీబీ కృష్ణసాయితేజ జైలు శిక్షతో పాటు జరిమానా విధించారు. ఈ మేరకు పోలీసులు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. రాజాం మండలం గెడ్డవలస గ్రామానికి చెందిన బూరాడ శ్రీనివాసరావుతో పాటు అతని తండ్రి చిన్నంనాయుడులు జోగ వెంకటరమణకు ఉద్యోగం ఇప్పిస్తామని 2016వ సంవత్సరంలో రూ.4 లక్షలు తీసుకున్నారు. ఉద్యోగం ఇప్పించకపోగా డబ్బులు కూడా వాపసు ఇవ్వకపోవడంతో అప్పట్లో రేగిడి పోలీస్‌స్టేషన్‌ను బాధితుడు ఆశ్రయించగా అప్పటి ఎస్సై వి.రమేష్ కేసు నమోదుచేయడంతో తరువాత వచ్చిన ఎస్సై జి.భాస్కరరావు దర్యాప్తు చేశారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువుకావడంతో ముద్దాయిలకు ఒక సంవత్సరం పాటు జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసును ఏపీపీ కిమిడి సూర్యకుమార్ వాదించారు.

ఇద్దరు చైన్‌స్నాచర్ల అరెస్ట్

విజయనగరం క్రైమ్: ఓ వ్యక్తి మెడలోని గొలుసును సోమవారం రాత్రి లాక్కుని పరారైన ఇద్దరు నిందితులను వన్‌టౌన్ పోలీసులు ఒకరోజు వ్యవధిలోనే అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన సీఐ బి.వెంకటరావు మంగళవారం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొత్తపేటకు చెందిన గుర్ల ఆనంద్, బొండపల్లికి చెందిన గేదెల సతీష్‌లు చెడు వ్యసనాలకు అలవాటు పడి ఈజీమనీ కోసం చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడేందుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో స్థానిక బాలాజీ కూడలి నుంచి పెద్దచెరువు గట్టు వైపు వెళ్లే రహదారిలో ఉన్న సులభ్ కాంప్లెక్స్ వద్ద కొద్దిగా చీకటిగా ఉండడం చూసి, సులభ్ కాంప్లెక్స్ లోపలి నుంచి బయటకు వస్తున్న అంబటివలస గ్రామానికి చెందిన గణేష్ మెడలో ఉన్న వెండి గొలుసు లాక్కుని పరారయ్యారు. దీంతో బాధితుడు వెంటనే వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదుచేసిన పోలీసులు మంగళవారం రైల్వేస్టేషన్ రోడ్డులో నిందితులిద్దరినీ అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. కేసు ఛేదించడంలో క్రియాశీలక పాత్ర పోషించిన ఎస్సైలు భాస్కరరావు, రామ్‌గణేష్, హెచ్‌సీ అచ్చిరాజు, కానిస్టేబుల్ శివకుమార్‌లను సీఐ అభినందించారు.

బాక్సింగ్ పోటీలకు జిల్లా జట్టు పయనం

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరగనున్న స్కూల్‌గేమ్స్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొనబోయే జిల్లా క్రీడా కారులు మంగళవారం పయనమయ్యారు. ఈ నెల 31 వ తేదీ నుంచి ఫిబ్రవరి 2 వ తేదీ వరకు రాజమండ్రిలో అండర్ -14, అండర్-17, అండర్ -19 విభాగాల్లో రాష్ట్రస్థాయి పోటీలు జరగనుండగా.. జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు పోటీల్లో తలపడనున్నారు. మూడు రోజుల పాటు జరగబోయే పోటీల్లో జిల్లా క్రీడాకారులు అద్భుత ప్రదర్శన కనబరిచి పతకాలు సాధించాలని ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో రౌతు భాస్కర్‌రావు, స్కూల్ గేమ్ ఫెడరేషన్ కార్యదర్శి ఎల్వీ రమణమూర్తి, పి.కృష్ణ, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు ఎస్‌ఈ రాజు, ఎస్.రమణ, శాప్ కోచ్ బి.ఈశ్వరరావు, సీనియర్ బాక్సర్లు వి.సంతోష్‌కుమార్, కె.శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రామతీర్థంలో ఉత్సవ శోభ



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

- నేడు రాములోరి తిరుక్కల్యాణం
- 4న రథంపై ఊరేగనున్న సీతాసమేత శ్రీరామచంద్రమూర్తి
- ఈనెల 18 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన ఆలయ అధికారులు



శ్రీరామతీర్థం దేవస్థానం

నెల్లిమర్ల రూరల్:

రామతీర్థంలో ఉత్సవశోభ నెలకుంది. సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామివారి దేవస్థానంలో స్వామివారి తిరుక్కల్యాణం, రథయాత్రతో పాటు మహాశివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు ముమ్మరంచేశారు. ఇప్పటికే ఉత్సవాలకు సంబంధించిన వాల్‌పోస్టర్లు, కరపత్రాలను సిద్ధం చేశారు. క్యూకాంప్లెక్సుల నిర్వహణ, ప్రసాదాల తయారీ, విద్యుత్ దీపాల అలంకరణ, పారిశుద్ధ్య నిర్వహణ తదితర వాటికి టెండర్లు ఆహ్వానిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి తిరుక్కల్యాణం జరగనుంది. 4 రథయాత్ర మహోత్సవాలు, ఈ నెల 18 నుంచి 20 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు.

సీతారాముల కల్యాణం చూతమురారండి

దేవస్థాన ఆస్థాన కల్యాణ మండపంలో బుధవారం సీతారాముల వార్షిక కల్యాణం వైభవంగా జరగనుంది. నిత్య పూజలు, దీక్షాధారణ, మంగళాశాసనం, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, అంకురారోపణం, అగ్ని ప్రతిష్టాపన, బలిహరణం, ధ్వజారోహణం తదితర పూజాకార్యక్రమాల అనంతరం రాత్రి 7.30 గంటలకు స్వామివారి మూడు వాహనాల సేవ జరిపిస్తారు. ఇందులో భాగంగా మూడు వాహనాలపై సీతారాముల ఉత్సవ విగ్రహాలను అశేష భక్త జనం నడుమ రామతీర్థం పురవీధుల్లో ఊరేగించి దేవాలయానికి తీసుకువస్తారు. అనంతరం రాత్రి 9.30 గంటలకు సీతారాముల తిరుక్కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా జరిపించనున్నారు. స్వామివారి కల్యాణానికి ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు పట్టు వస్త్రాలను సమకూర్చగా ఆయన తనయుడు ప్రదీప్ నాయుడు ఈఓ ప్రసాదరావుకు పట్టువస్త్రాలను అందజేశారు.



ఈఓ ప్రసాదరావుకు పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు తనయుడు ప్రదీప్‌నాయుడు



సిద్ధమైన స్వామి వారి వాహనాలు

4న రథయాత్ర

తిరుక్కల్యాణ, రథయాత్ర మహోత్సవాల్లో భాగంగా సీతారామస్వామి వారి సన్నిధిలో శ్రీమద్రామాయణ పారాయణం, వేద పఠనం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు, విశేషహోమాలను ప్రతి నిత్యం నిర్వహిస్తారు. 4వ తారీఖున రాత్రి 10 గంటలకు రథయాత్ర మహోత్సవాన్ని వేడుకగా జరపనున్నారు. సీతారామచంద్రస్వామి రామతీర్థం తిరువీధుల్లో రథంపై ఊరేగుతూ భక్తులకు సాక్షాత్కరిస్తారు. 6న రాత్రి 8 గంటలకు స్వామివారికి పుష్పాంజలి, పవళింపు సేవను నిర్వహించి తిరుక్కల్యాణ రథయాత్ర మహోత్సవాలను పూర్తిచేయనున్నారు.

ఈ నెల 18 నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు...

ఈ నెల 18 నుంచి 20వ తేదీవరకు రామతీర్థంలో మహాశివరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాల్లో ఉమా సదాశివుడి దర్శనంతో పాటు వేద పారాయాణం, పంచామృతాలతో శ్రీరామచంద్ర ప్రభువుకు స్నపన మహోత్సవాలను జరిపించనున్నారు. మూడు రోజుల పాటు జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారు.

ఉత్సవాలకు సమాయత్తం అవుతున్నాం

రామతీర్థంలో స్వామివారి తిరుక్కల్యాణం, రథయాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు సిద్ధమవుతున్నాం. నేడు జరగనున్న కల్యాణ మహోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. గోడపత్రికలను, కరపత్రాలను సిద్ధం చేసి ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉత్సవాలకు సంబంధించి ప్రచారాన్ని నిర్వహిస్తాం. శివరాత్రి ఉత్సవాల దృష్ట్యా అన్ని శాఖల అధికారులతో సమావేశాలను నిర్వహిస్తాం.

– ప్రసాదరావు, ఈఓ, రామతీర్థం దేవస్థానం

స్వామివారి కల్యాణానికి అంకురారోపణం



దేవస్థానానికి ఈశాన్య దిక్కులో మృత్సంగ్రహణం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

రాములోరి కల్యాణానికి అంకురారోపణ కార్యక్రమాన్ని అర్చకులు మంగళవారం వేడుకగా నిర్వహించారు. ముందుగా రామసన్నిధిలో ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మంగళవాయిద్యాల నడుమ గ్రామ బలిహరణ ప్రారంభించారు. దేవస్థానానికి ఈశాన్య దిక్కుకు వెళ్లి మేధినీదేవి రూపానికి మృత్సంగ్రహణం చేపట్టారు. అనంతరం పవిత్రమైన పుట్టమట్టిని ఆలయానికి తీసుకువచ్చి కల్యాణానికి అంకురారోపణ చేశారు. ఈఓ ప్రసాదరావు, అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, పవన్, దేవస్థాన సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.


ద్విచక్ర వాహనం బోల్తా: ముగ్గురికి గాయాలు

సీతంపేట: ద్విచక్రవాహనం బోల్తా పడిన సంఘటనలో కొత్తూరుకు చెందిన ముగ్గురు మైనర్లకు గాయాలయ్యాయి. సీతంపేట నుంచి కొత్తూరు బైక్‌పై వస్తుండగా మార్గమధ్యంలో ఐటీడీఏ వద్ద బైక్ అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవ్ చేస్తున్న సొండి అవినాష్‌తో పాటు వెనుక కూర్చున్న పి.రాజుమణి, శ్యాంప్రసాద్‌లు కింద పడిపోవడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. వాహనాన్ని నడిపిన అవినాష్‌తో పాటు వాహనాన్ని నడపడానికి బైక్ ఇచ్చిన పెదనాన్న దేవులపల్లి అప్పన్నపై కూడా కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ సుందరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై నీలకంఠం మాట్లాడుతూ ఈ మధ్య లైసెన్సులు లేని వ్యక్తులు, మైనర్లు ఎక్కువగా వాహనాలు నడిపి ప్రమాదాల పాలవుతున్నారని ఇలాగైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కాపర్ వైరు చోరీ

భోగాపురం: మండలంలోని దల్లిపేట గ్రామంలో రైతులకు ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ బోర్ల కోసం పొలాల వద్ద ఏర్పాటు చేసిన పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి అందులో కాపర్ వైరును దొంగిలించారు. దీనిపై రైతులు కిలుము సోమినాయుడు, రాము నరసమ్మ, నారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్సై పి.తవుడు తెలిపారు.

పైడితల్లికి పుష్పాలంకరణ



ప్రత్యేక అలంకరణలో పైడితల్లి అమ్మవారు



అమ్మవారిని దర్శించుకున్న భక్తులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, పసిడి తల్లి శ్రీ పైడితల్లి అమ్మవారు మంగళవారం పుష్పాలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు ఏడిద రమణ, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, మూలా పాపారావులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాదికాలు నిర్వహించారు. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిని మహిళలు దర్శించి పసుపు, కుంకుమలు చెల్లించి మొక్కుబడులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయం వెలుపల ఉన్న వేప, రావిచెట్ల వద్ద దీపారాధన చేశారు. అమ్మవారికి ఆలయ అధికారులు అరిసెలతో నివేదన చేశారు. కార్యకలాపాలను ఆలయ సూపర్‌వైజర్ ఏడుకొండలు పర్యవేక్షించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, తరించారు.

అండర్-19 ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధం





అండర్-19 ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా బాలికల జట్టు, బాలుర జట్టు

విజయనగరం: అంతర్ జిల్లాల అండర్-19 స్కూల్‌గేమ్స్ బాల, బాలికల ఖోఖో పోటీలకు జిల్లా జట్లు సిద్ధమయ్యాయి. ఈ మేరకు మంగళవారం నగరంలోని రాజీవ్ క్రీడామైదానం ప్రాంగణంలో జిల్లా అండర్-19 స్కూల్ గేమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి 160 మంది క్రీడాకారులు హాజరయ్యారు. వారిని జట్లుగా విభజించి పోటీలు నిర్వహించి, బాలుర జట్టులోకి 12 మందిని బాలికల జట్టులోకి 12 మంది క్రీడాకారులను ఎంపిక చేశారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జిల్లా వేదికగా జరగబోయే రాష్ట్రస్థాయి అండర్-19 ఖోఖో పోటీల్లో జిల్లా జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తారని అసోసియేషన్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ తెలిపారు. ఎంపిక పోటీలను విశ్రాంత వ్యాయామ అధ్యాపకులు బొమ్మన రామారావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, సత్యనారాయణ తదితరులు పర్యవేక్షించారు.

ప్రాసిక్యూషన్ కేసుల్లో నిందితులకు శిక్ష పడాలి



హాజరైన పోలీసు అధికారులు, సిబ్బంది

- నేర సమీక్షా సమావేశంలో ఎస్పీ ఎం.దీపిక



విజయనగరం క్రైమ్: న్యాయస్థానాల్లో విచారణలో ఉన్న కేసుల్లో ప్రాసిక్యూషన్లను ప్రాధాన్యతా క్రమంలో సంబంధిత సీఐలు, ఎస్సైలు గమనించాలని, నిందితులకు శిక్ష పడే విధంగా సాక్ష్యాలను సకాలంలో కోర్టులో ప్రవేశపెట్టి, నేరం నిరూపణయ్యే లా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎం.దీపిక పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు అధికారులతో వార్షిక నేర సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో గల గ్రామాలను ఆయా పోలీస్‌స్టేషన్‌లలో పనిచేసే పోలీసు సిబ్బందికి దత్తతగా ఇవ్వాలని, ఆయా గ్రామాల్లో తరచూ గ్రామసందర్శన చేయాలని, గ్రామాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనించాలని హితవు పలికారు. గ్రామస్థాయిలో సమాచారం సేకరించేందుకు ముఖ్యమైన వ్యక్తులు, అధికారుల ఫోన్ నంబర్లను సేకరించాలని, సమాచార వ్యవస్థను ప్రత్యేకంగా ఏర్పాటుచేసుకోవాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగిన వారిపైనా, మద్యం తాగి వాహనాలు నడిపే వారిపైనా, గంజాయి వినియోగించే వారు, సారా తయారీ, రవాణా అమ్మకాలు సాగించే వారిపై కేసులు నమోదుచేయాలని స్పష్టం చేశారు.

పేలుడు సామగ్రితో ప్రమాదాలు జరగకూడదు

వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న పేలుడు, మందుగుండు సామగ్రి వల్ల ఎటువంటి ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, సంబంధిత అధికారుల అనుమతితో వాటిని ప్రణాళిక ప్రకారం నిర్వీర్యం చేసేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. వివిధ కేసుల్లో న్యాయస్థానాలు జారీచేసే నాన్ బెయిలబుల్ వారంట్లను ఎగ్జిక్యూట్ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో విజయనగరం ఇన్చార్జ్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, దిశ మహిళా పీఎస్ డీఎస్పీ ఎం.వెంకటేశ్వర్లు, ట్రాఫిక్ డీఎస్పీ ఎల్.మోహనరావు, ఎఆర్ డీఎస్పీ ఎల్.శేషాద్రి, న్యాయ సలహాదారు వై.పరశురాం, సీఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు రాజాం విద్యార్థులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో కోచ్

రాజాం సిటీ: జాతీయస్థాయి కరాటే పోటీలకు రాజాం విద్యార్థులు ఎంపికయ్యారని కోచ్ ఆర్.శివ మంగళవారం తెలిపారు. 65వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా అండర్-14, 17, 19 విభాగాలలో స్టేట్‌లెవెల్ కరాటే పోటీలు ఈ నెల 29, 30తేదీలలో ఒంగోలులో నిర్వహించారు. ఈ పోటీల్లో పాల్గొన్న ఎన్.సాయిలక్ష్మి అండర్-19 విభాగంలో ద్వితీయస్థానం, వి.సూర్యచంద్ర అండర్-14 విభాగంలో మూడవ స్థానంలో నిలిచి జాతీయ స్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వారి ఎంపికపట్ల కరాటే కోచ్‌తోపాటు పట్టణానికి చెందిన పలువురు అభినందించారు.

పోలమాంబ.. పాహిమాం..!



తల్లీ.. కరుణించు..

- తొలిజాతరను మరిపించిన మారుజాతర
- అమ్మవారిని దర్శించుకున్న లక్షలాదిమంది భక్తులు
- క్యూకాంప్లెక్స్‌లు నిండిపోవడంతో ఎండలో వేసి ఉన్న భక్తులు
- భక్తులతో కిక్కిరిసిన శంబర



అమ్మవారిని దర్శించుకునేందుకు శంబర చేరుకున్న భక్తులు



పోలమాంబ అమ్మవారు





సిరిమానుకు పూజలు చేస్తున్న భక్తులు



గోముఖీనదిపై బారులుతీరిన భక్తులు



గాత్ర కచేరి

మక్కువ: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు, గిరిజనుల కులదైవం, భక్తుల కొంగుబంగారమైన శంబర పోలమాంబ అమ్మవారి మారుజాతర మంగళవారం కనులపండువగా సాగింది. తొలిజాతరను తలపించేలా మారుజాతరకు భక్తులు పోటెత్తారు. ఉదయం 5 గంటల నుంచి అమ్మవారి దర్శనానికి క్యూకట్టారు. లక్షలాది మంది భక్తుల రాకతో శంబర గ్రామం కిక్కిరిసిపోయింది. జైపోలమాంబ జయజయ ధ్వానాలు మారుమోగాయి. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ భక్తులు సుమారు లక్షా50వేల మంది రాకతో ఉదయం 11 గంటల తర్వాత రద్దీ పెరిగింది. ప్రధానాలయం వెనుకన ఏర్పాటుచేసిన క్యూకాంప్లెక్స్‌లు మొత్తం భక్తులతో నిండిపోయాయి. అమ్మవారి దర్శనం కోసం గంటల తరబడి ఎండలోనే గోముఖి నది బ్రిడ్జ్ వరకు క్యూలో వేచిఉన్నారు. చదురుగుడిలోని అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఇబ్బందిపడకుండా సాలూరు సీఐ ధనుంజయరావు, ఎస్ఐ జి.పైడిరాజు, ఇతర సర్కిల్స్, స్టేషన్లకు చెందిన సీఐలు, ఎస్ఐలు, పోలీస్‌సిబ్బంది పకడ్బందీగా విధులు నిర్వహించారు. రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రధానాలయంలో అమ్మవారిని భక్తులు దర్శించుకునేలా ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ దగ్గరుండి చర్యలు చేపట్టారు. ప్రధానాలయం వెనుకన ఏర్పాటుచేసిన ఉచిత, రూ.10, రూ.50 దర్శన టిక్కెట్ల లైన్ల గూండా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వనంగుడిలో ఉన్న పోలమాంబ అమ్మవారిని భక్తులు దర్శించుకొని, ఆలయం వెనకన ఉన్న వేపచెట్టుకు పూజలు చేశారు. ఘటాలు సమర్పించారు. పూజా కార్యక్రమాలను ట్రస్ట్‌బోర్డు సభ్యులతో పాటు చైర్మన్ పూడి దాలినాయుడు పర్యవేక్షించారు. దేవదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు లడ్డూప్రసాదం, పులిహోర ప్యాకెట్లను అందజేశారు. మారుజాతరలో 160 మంది పోలీసులు విధులు నిర్వహించారు.

సిరిమానుకు పూజలు

శంబర గ్రామంలోని ప్రధాన రహదారి వద్దనున్న సిరిమాను కర్రకు భక్తులు అధిక సంఖ్యలో పసుపు, కుంకమలతో పూజలు చేశారు. భక్తుల రద్దీ కారణంగా ఆలయంలోకి వెళ్లలేక చదురుగుడి ముందున అమ్మవారికి మొక్కుబడులు చెల్లించారు. చదురుగుడి వెనుకన ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. రాజాం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పెన్నేటి స్వప్నహైందవి, ముఖగాత్ర విద్వాంసురాలు అమ్మాజమ్మలు అమ్మవారి స్తోత్రాలను వినిపించారు.